దేశాన్ని వీడిన 537 మంది పాక్ పౌరులు

- అటారీ-వాఘా సరిహద్దు వద్ద బారులు తీరిన వాహనాలు
- ముగిసిన భారత ప్రభుత్వ డెడ్‌లైన్
- స్వదేశానికి 850 మంది ఇండియన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ పౌరులు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ భారత్ విధించిన డెడ్‌లైన్ ఆదివారంతో (మెడికల్ వీసా వారికి 29 వరకు) ముగిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజుల వ్యవధిలో 537 మంది పాక్ పౌరులు, దౌత్యవేత్తలు అటారీ-వాఘా సరిహద్దు వెంబడి దేశాన్ని వదిలి పాక్‌కు తిరిగి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా అమృత్‌సర్‌లోని ఈ అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఆదివారం పెద్దయెత్తున వాహనాలు బారులుతీరాయి. చాలామంది భారతీయులు దేశం విడిచివెళ్తున్న తమ బంధువులకు వీడ్కోలు పలకడానికి అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్విగ్న వాతావరణం ఏర్పడింది. 12 క్యాటగిరీల కింద స్వల్ప కాల వ్యవధి వీసాదారులు ఈ నెల 27లోగా దేశం వదిలి వెళ్లిపోవాలని భారత్ ఆదేశించింది. సార్క్ వీసా కలిగి ఉన్న వారికి ఏప్రిల్ 26, మెడికల్ వీసాలు ఉన్న వారికి ఏప్రిల్ 29 డెడ్‌లైన్‌గా విధించిన విషయం తెలిసిందే. అదేవిధంగా భారత్‌కు చెందిన 14 మంది దౌత్యవేత్తలు సహా 850 మంది ఈ అంతర్జాతీయ సరిహద్దు గుండానే భారత్‌కు చేరుకున్నారు.

తెలంగాణలో 208 మంది పాకిస్థానీయులు

తెలంగాణలో అధికారిక రికార్డుల ప్రకారం 208 మంది పాకిస్థాన్ పౌరులున్నారని పోలీస్ చీఫ్ జితేందర్ తెలిపారు. వీరిలో చాలామంది హైదరాబాద్‌లోనే ఉన్నారన్నారు. వీరిలో 156 మందికి దీర్ఘకాలిక వీసాలు, 13 మందికి స్వల్పకాలిక, 39 మంది పర్యాటక, వైద్య, వ్యాపార వీసాలపై వచ్చారన్నారు.

మహారాష్ట్రలో పాకిస్థానీయులు మిస్సింగ్

దేశంలో ఉన్న పాక్ పౌరుల లెక్కలు తీస్తున్న వేళ మహారాష్ట్రలో కీలక పరిణామం చోటు చేసుకుంది. మహారాష్ట్రలో 107 మంది పాకిస్థానీయులు కనిపించకుండా పోవడం కలకలం రేపుతోంది. మహారాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక డాటా ప్రకారం వివిధ రకాల వీసాలపై 5,050 మంది పాకిస్థానీలు ప్రస్తుతం రాష్ట్రంలో నివసిస్తున్నారు. వీరిలో 107 మంది జాడ తెలియడం లేదని, వీరి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మూడేండ్ల జైలు, 3 లక్షల జరిమానా

ఒక వేళ ఆదేశాలు ధిక్కరించి, ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్ లోగా భారత్ విడిచి వెళ్లని పాకిస్థానీయులను అధికారులు అరెస్ట్ చేస్తారు. వారికి మూడేండ్ల జైలు శిక్ష, లేదా 3 లక్షల జరిమానా లేక రెండు శిక్షలూ విధిస్తారు.

భారతీయురాలైన తన తల్లిని పాక్‌లోకి రానీయకపోవడంతో ఏడుస్తున్న ఓ పాక్ పౌరురాలు

భారత్‌పై దాడికి 130 అణు బాంబులు!

- సింధూ జలాలు ఆపితే యుద్ధానికి సిద్ధంగా ఉండండి
- గగనతలం మూసివేత కొనసాగిస్తే మీ వైమానిక సంస్థల దివాలా ఖాయం
- పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసీ ప్రేలాపన

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ విధించిన ఆంక్షలతో ఆ దేశం ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనడంతో దిక్కుతోచని స్థితిలో పాకిస్థాన్ మంత్రి భారత్‌ను మరింత రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలతో భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంటామంటూ ఆ దేశ మంత్రి హనీఫ్ అబ్బాసీ బహిరంగంగానే హెచ్చరించారు. పాకిస్థాన్ ఆయుధగారంలో ఘోరి, షాహిన్, ఘజ్నవి క్షిపణులు సహా 130 అణు వార్‌హెడ్‌లు కేవలం భారత్ కోసమే సిద్ధంగా ఉంచినట్టు ఆయన చెప్పారు. భారత్ సింధూ జలాల సరఫరాను నిలిపివేస్తే పూర్తి స్థాయి యుద్ధానికి ఆ దేశం సిద్ధంగా ఉండాలని అన్నారు. పాకిస్థాన్‌లోని అణు ఆయుధాలు ఉన్నవి కేవలం ప్రదర్శించడానికి కాదని, తమ దేశంలోని వివిధ రహస్య ప్రదేశాల్లో వాటిని ఉంచామని, ఏమాత్రం రెచ్చగొట్టినా దాడిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. భారత్ ప్రకటించిన ఆంక్షలు, ఇతర నిర్ణయాలకు తీవ్ర పరిణామాలు తప్పవని తెలిపారు. తమ గగనతలం మూసివేత కొనసాగిస్తే మీ వైమానిక సంస్థలు దివాళా తీయడం ఖాయమని అన్నారు.

పీవోకేలో వరద హెచ్చరికలు

జీలం నదిలోకి భారత్ అకస్మాత్తుగా నీటిని వదిలిందని పాక్ ఆరోపణలు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జీలంనదిలోకి భారత్ అకస్మాత్తుగా నీటిని విడుదల చేసిందని పాక్ ఆరోపించింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో(పీవోకే) ముజఫరాబాద్ వద్ద జీలంనదిలో నీటి మట్టాలు అకస్మాత్తుగా పెరిగాయని 'దునియా' న్యూస్ నివేదిక పేర్కొంది. దీనికి భారతదేశమే కారణమని ఆరోపించింది. ముజఫరాబాద్‌కు దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో జీలం నది ఒడ్డున ఉన్న హట్టియన్ బలా అనే ప్రాంతంలో స్థానిక అధికారులు నీటి అత్యవసర స్థితిని ప్రకటించారు. మసీదుల్లో ప్రకటనల ద్వారా స్థానికులను హెచ్చరించారు.

22 గంటలు ట్రెక్కింగ్ చేసి!

- కోకెర్నాగ్ అడవుల నుంచి పహల్గాంకు ముష్కరులు
- అధికార వర్గాల వెల్లడి
- కేసు ఎన్ఐఏకి అప్పగింత
- దర్యాప్తులో కీలకంగా మారిన ఫొటోగ్రాఫర్ వీడియో

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ముష్కరులు పహల్గాం చేరుకునేందుకు దాదాపు 22 గంటలపాటు ట్రెక్కింగ్ చేసినట్టు దర్యాప్తులో తేలిందని అధికార వర్గాలు వెల్లడించాయి. తమ ప్రణాళికను అమలుచేసేందుకు ఉగ్రవాదులు కష్టతరమైన కొకెర్నాగ్ అడవుల గుండా బైసరన్ లోయకు కాలినడకన చేరుకున్నట్టు తెలిసింది. ఈ దాడిలో ముగ్గురు పాక్ టెర్రరిస్టులు, ఒక స్థానిక ఉగ్రవాది (ఆదిల్ థోకర్) పాల్గొన్నారని భద్రతా వర్గాలు తెలిపాయి. ఉగ్రవాదులు ఏకే-47, ఎం2 అసాల్ట్ రైఫిల్స్‌తో పర్యాటకులను కాల్చి చంపారని ఘటనా స్థలిలో దొరికిన తూటాల ఆధారంగా నిర్ధారించారు. ఇద్దరు ఉగ్రవాదులు దుకాణాల వెనుక నుంచి కల్మా పఠించాలని పర్యాటకులను ఆదేశించి.. పఠించని వారిని కాల్చి చంపారు. మరో ఇద్దరు టెర్రరిస్టులు జిప్‌లైన్ వద్ద నిలబడి టూరిస్టులపై కాల్పులకు తెగబడ్డారు. దాడి చేశాక ఒక పర్యాటకుడు, ఒక స్థానికుడి మొబైల్ ఫోన్లను ఉగ్రవాదులు స్వాధీనం చేసుకున్నారు.

కీలకంగా ఆ పుటేజీ..

ఈ ఉగ్ర దాడికి సంబంధించి స్థానిక ఫొటోగ్రాఫర్ రికార్డ్ చేసిన పుటేజీ దర్యాప్తులో కీలకంగా మారింది. దాడి జరిగినప్పుడు అతడు అక్కడే ఉన్న ఒక చెట్టు పైకి ఎక్కి కాల్పుల ఘటనను వీడియో తీశారు. ఇప్పుడు ఈ వీడియో దర్యాప్తులో కీలకంగా మారింది. అదే రోజు బైసరన్ లోయలో విహార యాత్రకు వచ్చిన లెఫ్టినెంట్ కర్నల్ ఇచ్చిన సాక్ష్యం కూడా దర్యాప్తుకు బాగా ఉపయోగపడనుంది. మరోవైపు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) పహల్గాం ఉగ్రదాడి దర్యాప్తును తన చేతుల్లోకి తీసుకుంది. ఆ సంస్థ ఉగ్రవాద నిరోధక బృందాలు ఈ నెల 23 నుంచి ఘటనా స్థలిలో మకాం వేసి ఆధారాలను సేకరించాయి. ప్రత్యక్ష సాక్షులను ప్రశ్నించి ఘటన జరిగిన తీరుని క్షుణ్ణంగా తెలుసుకున్నాయి. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసి ఘటన జరిగిన తీరును పరిశీలించాయి. ఫోరెన్సిక్ నిపుణుల సాయంతో ప్రతి ఆధారాన్ని సేకరించాయి.

సరిహద్దుల్లో మళ్లీ పాక్ కవ్వింపులు

జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి పాకిస్థాన్ వరుసగా మూడో రోజు కూడా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. అయితే పాకిస్థాన్ కాల్పులను భారత సైనికులు సమర్థంగా తిప్పికొట్టినట్టు ఆదివారం అధికారులు తెలిపారు. వరుసగా మూడో రోజు రాత్రి కూడా పాక్ సైనికులు భారత్‌ను రెచ్చగొట్టేలా కాల్పులు జరిపారని చెప్పారు. ఈ కాల్పుల్లో ఎవరూ గాయపడలేదని పేర్కొన్నారు.

మరో ముగ్గురు ఉగ్రవాదుల ఇళ్లు ధ్వంసం

ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్టు భావిస్తున్న ముగ్గురి ఇళ్లను బందిపొర, పుల్వామా, షోపియాన్ జిల్లాల్లో ధ్వంసం చేశారు. పహల్గాం దాడి తర్వాత భద్రతా దళాలు ఉగ్రవాదులపై అణచివేతను కొనసాగించాయి. ఇప్పటివరకు అధికారులు అనుమానిత ఉగ్రవాదులకు చెందిన తొమ్మిది ఇండ్లను నేలమట్టం చేశారు. పహల్గాం ఉదంతం తర్వాత భద్రతా దళాలు కశ్మీర్ లోయలో ఐదు రోజుల వ్యవధిలో 500కు పైగా ప్రాంతాల్లో దాడులు చేసి వందలాది మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నాయి.

ఇంకా పాక్ నిర్బంధంలోనే భారత జవాన్

పాకిస్థాన్‌కు బందీగా చిక్కిన భారత జవాన్ విడుదలపై 90 గంటలు దాటినా అదే ప్రతిష్టంభన కొనసాగుతున్నది. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ వద్ద అంతర్జాతీయ సరిహద్దు వద్ద పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పూర్ణం కుమార్ సాహు పొరపాటున బుధవారం పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లడంతో అతడిని పాక్ రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. అతని విడుదల కోసం పాకిస్థాన్ రేంజర్లతో బీఎస్ఎఫ్ అధికారులు మూడుసార్లు ఫ్లాగ్ మీటింగ్‌లు జరిపారు. అయితే అతడిని అప్పగించడానికి పాక్ తిరస్కరించింది. ఈసారి ఫీల్డ్ కమాండర్ స్థాయిలో ఫ్లాగ్ మీటింగ్ జరపాలని భారత్ నిర్ణయించింది. త్వరలోనే ఈ సమావేశం జరుగుతుందని తెలిపింది.

పాక్‌తో యుద్ధం అవసరం లేదు

- భారత్ తొందరపడకూడదు
- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య
- పాక్ రత్న అంటూ బీజేపీ విమర్శలు

బెంగళూరు, ఏప్రిల్ 27: పహల్గాం దాడిపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారితీశాయి. పాకిస్థాన్‌తో యుద్ధానికి భారత్ తొందరపడకూడదని, భద్రతా చర్యలను పటిష్టం చేయటంపై దృష్టి సారించాలని ఆయన అభిప్రాయపడ్డారు. శనివారం మైసూర్‌లో ఆయన మాట్లాడుతూ, 'పాకిస్థాన్‌తో యుద్ధం అవసరం లేదు. మేం యుద్ధానికి అనుకూలం కాదు. శాంతి నెలకొనాలి. ప్రజలు సురక్షితంగా ఉన్నామని భావించేలా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే' అని అన్నారు. కేంద్ర ప్రభుత్వ భద్రతా వైఫల్యాలను తప్పుబట్టారు. ఆయన కామెంట్స్‌ను పాకిస్థాన్ మీడియా సైతం ప్రముఖంగా ప్రస్తావించింది. జియో న్యూస్ సహా పాక్‌కు చెందిన వివిధ న్యూస్ చానల్స్ ఆయన వ్యాఖ్యల్ని ప్రసారం చేశాయి. 'ఇండియాలోనే యుద్ధానికి వ్యతిరేకంగా నిరసన గళం వ్యక్తమవుతున్నది' అని పాక్ మీడియా పేర్కొన్నది. దీంతో ఈ వ్యవహారంపై ఆదివారం సీఎం సిద్ధరామయ్య వివరణ ఇచ్చారు. 'వెంటనే యుద్ధం వద్దన్నా. అంతేగానీ.. పూర్తిగా వద్దనలేదు' అంటూ చెప్పుకొచ్చారు.

శత్రువుకు మేలు చేసేలా సీఎం వ్యాఖ్యలు: కర్ణాటక బీజేపీ చీఫ్

సిద్ధరామయ్య వ్యాఖ్యలపై కర్ణాటక బీజేపీ మండిపడింది. పాకిస్థాన్ రత్నగా సిద్ధరామయ్య మాట్లాడుతున్నారని విపక్ష నేత, బీజేపీ నాయకుడు ఆర్ అశోక ఎద్దేవా చేశారు. జాతీయ భద్రతకు సంబంధించి ఎలా మాట్లాడాలో కూడా సిద్ధరామయ్యకు తెలియకపోవటం కర్ణాటక దురదృష్టమని, శత్రువుకు మేలు చేసేలా మాట్లాడారని విమర్శించారు.

దేశ విభజనతో అపరిష్కృతంగా మిగిలిపోయిన ప్రశ్నల ఫలితమేనా?

ఉగ్రదాడిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ విభజన నాటి నుంచి అపరిష్కృతంగా మిగిలిపోయిన ప్రశ్నల వల్లనే ఈ విషాద ఘటన చోటుచేసుకున్నదా? అని ప్రశ్నించారు.

ఉగ్రవాదులు మతాన్ని అడగలేదు: కాంగ్రెస్ మంత్రి

పహల్గాం ఉగ్రదాడి ఘటనపై బాధితుల మాటల్ని తోసిపుచ్చుతూ.. కర్ణాటక కాంగ్రెస్ మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన 'ఎక్స్'లో స్పందిస్తూ, 'పహల్గాంలో ఉగ్రవాదులు మతం గురించి అడిగి కాల్పులు జరిపారన్నది నిజం కాదు. పహల్గాం బాధితురాలు (మంజునాథ భార్య పల్లవి) తలకాయ లేని మాటలు మాట్లాడింది. ఘటన తర్వాత మెదడుపై ఆమె నియంత్రణ కోల్పోయింది' అని అన్నారు. 'కార్గిల్ అయినా, పుల్వామా అయినా..ఇది పూర్తిగా భద్రతా పరమైన వైఫల్యం. ఘటనలో తన భర్తను కోల్పోయిన పల్లవి, మతితప్పి చెప్పిన మాటలు అవి. ఒకవేళ ఆమె మాట్లాడిందే నిజమైతే, ముస్లింలను ఉగ్రవాదులు ఎందుకు చంపారని ప్రశ్నిస్తున్నా?' అని అన్నారు. కులం, మతం అడిగి కాల్పులు జరపటం సాధ్యమా? అని ఆయన ప్రశ్నించారు.

కిలో బియ్యం 340.. కిలో చికెన్ 800

పాకిస్థాన్‌లో కొండెక్కిన ధరలు

ఇస్లామాబాద్, ఏప్రిల్ 27: ఇప్పటికే తీవ్ర నగదు కొరత, ఆర్థిక సంక్షోభంతో కునారిల్లుతున్న పాకిస్థాన్‌కు పులిమీద పుట్రలా భారత్ విధించిన పహల్గాం ఆంక్షలు కూడా తోడవ్వడంతో మరింత సంక్షోభంలోకి కూరుకుపోతున్నది. భారత్‌తో ఏ క్షణమైనా యుద్ధం ప్రారంభం కావచ్చునన్న వార్తలతో ఆ దేశ ద్రవ్యోల్బణం కొండెక్కింది. ఇప్పటికే ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బియ్యం, కూరగాయలు, పండ్లు, చికెన్‌ల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రస్తుతం అక్కడ కేజీ చికెన్ ధర రూ.798, కిలో బియ్యం ధర 339, గుడ్లు డజన్ 332, ఆపిల్ కేజీ 288, పాలు లీటర్ 224, బ్రెడ్ 500 గ్రా. 161, అరటిపండ్లు కిలో 176, టమోటా కిలో 150, ఆలుగడ్డ కిలో 105, ఆరెంజ్ కిలో రూ.216ల ధర పలుకుతున్నాయి. ఎగుమతులపై భారత్ విధించిన ఆంక్షల కారణంగా పాకిస్థాన్‌లో పలు అత్యవసర మందులకు తీవ్ర కొరత ఏర్పడుతుందని అక్కడి అధికారులు ఆందోళన చెందుతున్నారు.

ఎప్పుడైనా.. ఎక్కడైనా!

- దేశ ప్రయోజనాలు కాపాడేందుకు సిద్ధం
- నేవీ యాంటీషిప్ ఫైరింగ్ పరీక్ష

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో పాక్-భారత్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన క్రమంలో భారత నౌకాదళం తమ పోరాట పరాక్రమాన్ని ప్రదర్శించింది. నౌకాదళానికి చెందిన యుద్ధనౌకలు బహుళ యాంటీ-షిప్ ఫైరింగ్ (శత్రుదేశ నౌకలపై క్షిపణులు లేదా గన్ ఫైరింగ్ ద్వారా దాడి) విజయవంతంగా నిర్వహించింది. దీర్ఘ శ్రేణి కచ్చితమైన దాడులకు తాము సంసిద్ధంగా ఉన్నామని నౌకా దళం నొక్కిచెప్పింది. దేశ సముద్ర ప్రయోజనాలను ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాగైనా కాపాడుకోవడంలో భారత నావికా దళం యుద్ధానికి సిద్ధంగా ఉందని, భవిష్యత్తు పరిణామాలను ఎదుర్కోడానికి సంసిద్ధంగా ఉందని పేర్కొంటూ దీని వీడియోలను విడుదల చేసింది. అయితే ఇవి ఎక్కడ, ఎప్పుడు జరిపిందీ వివరాలు వెల్లడించ లేదు.

ప్రతి భారతీయుడి రక్తం మరుగుతున్నది

బాధితులకు కచ్చితంగా న్యాయం జరుగుతుంది: మోదీ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడి బాధితులకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. 26 మంది అమాయకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులకు, వారి వెనుక ఉన్న కుట్రదారులకు కఠినాతి కఠినమైన శిక్షలు పడతాయని స్పష్టం చేశారు. ఈ దాడికి సంబంధించిన చిత్రాలు, వీడియోలను చూసిన ప్రతి భారతీయుడి రక్తం మరిగిపోతున్నదన్నారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఆయన ప్రజలకు వినిపించే 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఉగ్రవాదంపై నిర్ణయాత్మక పోరాటానికి మన ఐక్యతే ప్రాతిపదిక అని చెప్పారు. జమ్ముకశ్మీర్ సాధిస్తున్న పురోగతిని చూసి ఓర్వలేక.. అమాయకులపై ఉగ్రవాదులు దాడి చేశారని ఆరోపించారు.

మరదలితో వదిన పరార్!

- ముగ్గురు పిల్లలను వదిలేసి రహస్యంగా వివాహం
- అరెస్ట్ చేసిన బీహార్ పోలీసులు

దర్భంగ: బీహార్‌లోని దర్భంగ జిల్లాలో షాకింగ్ ఘటన జరిగింది. ముగ్గురు పిల్లల తల్లి తన మరదలితో స్వలింగ సంబంధం పెట్టుకొని ఆమెను రహస్యంగా పెండ్లాడి పరారైంది. ఈ నెల 26న ఆమె, ఆమె భర్త, మైనర్ మరదలు రాజస్థాన్ నుంచి ఆమె స్వగ్రామం కుషెష్వర్‌స్థాన్‌కు తిరిగి వచ్చినప్పుడు ఆమెను, ఆమె భర్తను బహెరి పోలీసులు అరెస్ట్ చేశారు. వారిద్దరిని జ్యుడిషియల్ కస్టడీలో ఉంచాలని కోర్ట్ ఆదేశించింది. మైనర్ బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆమె కుటుంబానికి అప్పజెప్పారు. పోలీసుల కథనం ప్రకారం క్రితి దేవికి 11 ఏండ్ల క్రితం కృష్ణ మాంఝీతో పెండ్లి జరిగింది. వారికి ముగ్గురు పిల్లలున్నారు. క్రితి దేవి మైనర్ బాలిక పెద్ద అక్కకు వదిన అవుతుంది. క్రితి దేవి రెండేండ్లుగా తమ ఇద్దరి కుటుంబాలకు తెలియకుండా మైనర్ బాలికతో ప్రేమాయణం సాగిస్తున్నది. క్రితి దేవి వదిలేస్తానని తరచూ తన భర్తను బెదిరించేది. అలాగే తన మైనర్ ప్రియురాలితో సంబంధాన్ని వదిలి పెట్టనని చెప్పేది. అయితే ఈ నెల 6న మైనర్ బాలిక తండ్రి తన కూతురు అపహరణకు గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈలోగా క్రితి దేవి, మైనర్ రహస్యంగా పెండ్లి చేసుకొని రాజస్థాన్‌కు పారిపోయారు. ఈ విషయం తెలిసి భర్త హెచ్చరించినా ప్రియురాలితో సంబంధాన్ని తెంచుకోవడానికి క్రితి దేవి నిరాకరించింది. ఈ ఘటనపై మైనర్ తల్లి స్పందిస్తూ క్రితి దేవిని ఒక కుటుంబ సభ్యురాలిగా గౌరవించి తమ కుటుంబంలోకి ఆహ్వానించామని.. అయితే ఆమె ఉద్దేశం తెలిసి ఉంటే ఆమెను ఇంట్లోకే రానిచ్చే వాళ్లమే కాదని తెలిపారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 51 మంది మృతి

గాజా : ఇజ్రాయెల్ దాడుల్లో తాజాగా 51 మంది మరణించినట్లు గాజా స్ట్రిప్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. దీంతో మొత్తం మృతుల సంఖ్య 52,243కు చేరినట్లు పేర్కొంది. హమాస్ ఉగ్రవాద సంస్థతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ దళాలు మార్చి 18న పక్కనబెట్టి, ప్రతి రోజూ దాడులు చేస్తున్నాయి. సైనిక దళాలు బఫర్ జోన్‌ను విస్తరించాయి. రఫాను చుట్టుముట్టాయి. ఈ ప్రాంతంలో 50 శాతం భూభాగంపై పట్టు సాధించాయి.

800 గుడిసెలు ఆహుతి

ఢిల్లీలో ఇద్దరు చిన్నారుల మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని రోహిణి, సెక్టర్ 17లో ఉన్న ఝుగ్గి క్లస్టర్‌లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. 800 గుడిసెలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలపాటు శ్రమించి, మంటలను ఆర్పేశారు. రోహిణి డిప్యూటీ పోలీస్ కమిషనర్ అమిత్ గోయల్ మాట్లాడుతూ, రెండున్నరేళ్లు, మూడేళ్లు వయసుగల చిన్నారుల మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు.

స్పేస్‌లో సౌర విద్యుత్తు!

- అంతరిక్షం నుంచి నేరుగా భూమికి
- మైక్రోవేవ్ రూపంలో ట్రాన్స్‌మిషన్
- వైర్ల అవసరం లేకుండానే
- జపాన్ శాస్త్రవేత్తల పరిశోధన
- త్వరలో శాటిలైట్ ప్రయోగం



టోక్యో, ఏప్రిల్ 27: అంతరిక్షంలో సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు జపాన్ సన్నాహాలు చేస్తున్నది. స్పేస్‌లో సూర్యరశ్మి సాయంతో కరెంటును తయారు చేసి, అక్కడి నుంచి నేరుగా భూమిపైకి పంపించేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. స్పేస్ నుంచి భూమిపైకి వైర్ల అవసరం లేకుండానే, మైక్రోవేవ్ రూపంలో ఆ విద్యుత్తును పంపించేలా ప్రయోగాలు చేస్తున్నది. ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేయాలని జపాన్ స్పేస్ సిస్టమ్స్ (జేఎస్ఎస్) శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఒహిసామా (జపనీస్‌లో సూర్యుడు) పేరిట చేపడుతున్న ఈ ప్రయోగం కోసం ఇప్పటికే జపాన్ శాస్త్రవేత్తలు అన్నీ సంసిద్ధం చేశారు. కచ్చితమైన సమాచారం లేనప్పటికీ, ఏప్రిల్ తర్వాత ఏ క్షణంలోనైనా ఈ ప్రయోగం నిర్వహించే ఆస్కారం ఉంది.

ఎనర్జీ బీమ్ రూపంలో...

ప్రయోగంలో భాగంగా 400 పౌండ్స్ (180 గ్రాములు) మాత్రమే బరువుండే ఓ శాటిలైట్‌ను శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి పంపించనున్నారు. ఈ శాటిలైట్‌లో 2 స్క్వేర్ మీటర్ల సోలార్ ప్యానెళ్లు ఉంటాయి. ఈ సోలార్ ప్యానెల్ సూర్యరశ్మిని గ్రహించి విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. ఆ విద్యుత్తును బ్యాటరీలో స్టోర్ చేస్తుంది. సాధారణంగా భూమిపై సోలార్ ప్యానెళ్లు ఉత్పత్తి చేసే కరెంట్‌ను వైర్ల సాయంతో సరఫరా చేస్తారు. అయితే, స్పేస్‌లో వైర్ల సదుపాయం లేకపోవడంతో స్పేస్ నుంచి భూమికి ఈ విధంగా విద్యుత్తును పంపించడం సాధ్యపడదు. ఈ నేపథ్యంలో జపాన్ శాస్త్రవేత్తలు కొత్త పద్ధతిపై దృష్టి సారించారు. స్పేస్‌లో ఉత్పత్తి అయిన విద్యుత్తును తొలుత మైక్రోవేవ్ రూపంలోకి మారుస్తారు. ఆ తర్వాత ఎనర్జీ బీమ్ రూపంలో ఆ విద్యుత్తును భూమికి పంపిస్తారు. భూమిపై ఉండే యాంటెన్నాలు దాన్ని రిసీవ్ చేసుకుంటాయి. ప్రస్తుతానికి చాలా తక్కువ మొత్తంలో సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు ప్రయోగం చేస్తున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, భవిష్యత్తులో పెద్దమొత్తంలో ఉత్పత్తి చేయాలని జపాన్ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

గతంలోనే అమెరికా పరిశోధనలు...

స్పేస్‌లో సౌర విద్యుత్తు ఉత్పత్తిపై ప్రయోగాలు చేయడం ఇదే మొదటిసారి కాదు. 2020లో ఎక్స్-37బీ ఆర్బిటల్ టెస్ట్ వెహికిల్ ద్వారా యూఎస్ నావల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (ఎన్ఆర్ఎల్) పరిశోధకులు స్పేస్‌లో సౌర విద్యుత్తును ఉత్పత్తి చేశారు. వైర్ల అవసరం లేకుండానే మైక్రోవేవ్ ఎనర్జీ రూపంలో దాన్ని భూమిపైకి పంపించారు. అయితే, కిలోవాట్-అవర్ సౌర విద్యుత్తు ఉత్పత్తికి ఎక్కువ వ్యయం అవడంతో ఆ పరిశోధనలకు స్వస్తి పలికారు. ఇప్పుడు భూమిపై కిలోవాట్-అవర్ సౌర విద్యుత్తు ఉత్పత్తికి 5 సెంట్స్ (100 అంటే ఒక డాలర్) మాత్రమే వ్యయం అవుతుండటంతో జపాన్ పరిశోధకులు ప్రయోగం చేస్తున్నారు.

ఉగ్ర తూటాలకు సామాజిక కార్యకర్త బలి

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదులు గులాం రసూల్ మాగ్రే(45) అనే సామాజిక కార్యకర్తను కాల్చి చంపారని అధికారులు ఆదివారం వెల్లడించారు. ఈ ఘటన శనివారం రాత్రి జరిగిందని చెప్పారు. కండి ఖాస్‌లోని మాగ్రే నివాసంలోనే ఆయనపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారని తెలిపారు. మాగ్రేను వెంటనే దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే ఆయన చనిపోయాడని వైద్యులు ధ్రువీకరించారు. ఉగ్రవాదులు ఈ హత్యకు ఎందుకు పాల్పడ్డారో కారణాలు తెలియలేదు.

పీవోకేను స్వాధీనం చేసుకోవాల్సిందే

టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ

కోల్‌కతా: ఇది పాకిస్థాన్‌పై మరిన్ని సర్జికల్ స్ట్రైక్స్ లేదా నామమాత్రపు బెదిరింపులు చేసే కాలం కాదని టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ అన్నారు. అర్థమయ్యే భాషలోనే వారికి గుణపాఠం చెప్పవలసిన సమయమని చెప్పారు. పాక్ ఆక్రమిత కశ్మీరును(పీవోకే) తిరిగి స్వాధీనం చేసుకోవలసిన సమయమని తెలిపారు. దృఢనిశ్చయంతో సమస్యను ఎదుర్కొనాలని అన్నారు. పహల్గాంలో ఉగ్రవాద దాడికి దారి తీసిన లోపాలపై కట్టుదిట్టంగా దర్యాప్తు చేయడానికి బదులుగా, ఓ రాజకీయ పార్టీకి లబ్ధి చేకూరే విధంగా ఓ కథనాన్ని ప్రజల ముందు పెట్టడంపైనే దృష్టి సారిస్తున్నారని 'ఎక్స్'లో పోస్ట్ చేసిన సందేశంలో ఆరోపించారు.

ఉగ్ర దాడిపై రష్యా, చైనాలతో దర్యాప్తు చేయించాలి

పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా సూచన

మాస్కో: పహల్గాం ఉగ్రదాడి ఘటనపై రష్యా, చైనాలతో దర్యాప్తు జరిపించాలని